క్లుప్తంగా

నియామకం



ఎస్ఎస్ తాడ్వాయి: కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా యాషాడపు మల్లయ్యను నియమించినట్లు మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ తెలిపారు. సింగల్ విండో డైరెక్టర్‌గా, పార్టీ బలోపేతం కోసం అహర్నిషలు కృషి చేస్తున్న కాల్వపల్లి గ్రామానికి మల్లయ్యను ఎమ్మెల్యే సీతక్క ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ నిర్ణయం మేరకు బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి మల్లయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రిని కలిసిన నాయకులు



ములుగు రూరల్: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ను బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కోయిల మహేష్, నాగ రమేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని అబ్బాపురంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్ సమక్షంలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ ప్రతిష్టాతకు యువత కీలకమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకువెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, యువజన విభాగం నాయకులు ఉన్నారు.

వైద్య పరీక్షలు



వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 91 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను ములుగు ఏరియా వైద్యశాలకు పరీక్షలకు నిమిత్తం పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇబ్బంది పెట్టడం సరికాదు

ములుగు రూరల్: ఉపాధ్యాయులకు జూన్ 11 వరకు వేసవి సెలవులు ప్రకటించి బడిబాట కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారుల అనాలోచిత నిర్ణయాలని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏళ్ల ముధుసుదన్, శిరుప సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేసే ఆదేశాలను రద్దు చేయాలని కోరారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో జూన్ 20న మాత్రమే విద్యా దినోత్సవం ఉంటుందని వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు.

రేపటి నుంచి కౌన్సెలింగ్

ఏటూరునాగారం: తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాల ఏటూరునాగారంలో డిగ్రీ చదివే గిరిజన విద్యార్థులకు జూన్ 1 నుంచి 12వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ శివకల్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష రాసి అర్హత సాధించిన విద్యార్థినులు ఏటూరునాగారం మహిళా డిగ్రీ కళాశాలలో రిపోర్ట్ చేయాలన్నారు. రిపోర్ట్ చేసేందుకు వచ్చే విద్యార్థినులు వారి వెంట పదో తరగతి మార్కుల మెమో, ఇంటర్ మెమో, టీజీయూజీసీఈటీ హాల్‌టికెట్, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, 5, 10 వతరగతి వరకు స్టడీ, కండక్ట్, బొనిఫైడ్ ధ్రువీకరణ పత్రాలు, పాస్ ఫోటోలు ఐదు వెంట తీసుకు రావాలన్నారు. మరింత సమాచారం కోసం 8978905817 నంబర్‌ను సంప్రదించాలి.

విద్యార్థుల ప్రతిభ

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన హారిక, శ్రీశాన్వీ, కీర్తన, సహస్రిత, వైష్ణవి, రిత్విక్‌లు 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలో అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు వణీంద్రమణి మంగళవారం తెలిపారు.

వాణీ విద్యానికేతన్ విద్యార్థుల ప్రతిభ

రేగొండ మండల కేంద్రంలోని వాణీ విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో 5వ తరగతి గురుకుల అర్హత పరీక్షకు 25 మంది విద్యార్థులు హాజరు కాగా 18 మంది అర్హత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గాజర్ల తిరుపతి తెలిపారు.

చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో చదువుతున్న 8 మంది విద్యార్థులు తెలంగాణ గురుకుల సెట్ 2023 ఫలితాల్లో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఐదవ తరగతిలో ప్రవేశాలకు అర్హత సాధించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎండి రాజ్ మహమ్మద్ మంగళవారం తెలిపారు.

యువత సేవాభావాన్ని అలవర్చుకోవాలి



దేవయ్యకు నగదు అందజేస్తున్న సీఐ మండల రాజు



బియ్యం అందజేస్తున్న సీఐ, బ్లడ్ డోనర్స్ సభ్యులు

ఏటూరునాగారం: నేటి యువత సేవా భావాన్ని అలవర్చుకోవాలని సీఐ మండల రాజు అన్నారు. బ్లడ్ డోనర్స్ గ్రూపు సభ్యులు ఆధ్వర్యంలో దాతల నుంచి సేకరించిన వివారాశాలను ఆపదలో ఉన్న వారికి ఇవ్వడం అభినందనీయమని సీఐ కొనియాడారు. మంగళవారం మండలంలోని శివాపూర్ గ్రామంలో దాతల సహాయంతో ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను చేపట్టారు. శివాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కేతిరి సుగుణకు, గోగుపల్లికి చెందిన దివ్యాంగుడు యాలం రమేష్‌కు ఒక్కొక్కరి 50 కిలోల బియ్యం, రూ.2వేలు అందజేశారు.

దేవయ్యకు అండగా ఉంటాం..

మండలంలోని గోగుపల్లికి చెందిన మీస దేవయ్య కుటుంబానికి రూ. లక్ష రెండు వేలు కుటుంబానికి అందజేశామని సీఐ తెలిపారు. గుండె సంబంధించిన ఆపరేషన్ కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి ఆపరేషన్ అయ్యేవిధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం బ్లడ్ డోనర్స్ అధ్యక్షుడు సయ్యద్ వహీద్, మెరుగు హరీష్, బండపల్లి సంతోష్, వద్ది నరేష్, విజయ భాస్కర్, కొయ్యల సతీష్, తడక సుమన్, రియాజ్, కందికట్ల సతీష్, శివాపూర్ ఉప సర్పంచ్ రాణి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగపడ్ల రవి, ఏనుగుల మహేష్, ఎలుకపల్లి శ్రీనివాస్, కప్పల అశోక్, పోరెడ్డి శ్రీనివాస్, బెల్లం రాజు, ఏమరెడ్డి శేఖర్ రెడ్డి, దుబ్బాక రాకేష్, సింగిరెడ్డి శ్రీరాములు, సబ్సిడీ శ్రీను, బిరెడ్డి నర్సిరెడ్డి, హమాలీ యూనియన్, ట్రాక్టర్ యూనియన్, మహిళా సంఘం కనుకుల రాధిక, రావుల జగన్, కామన్ల కుమార్, శోభన్, తాటి కృష్ణ, సుంకరి సుధాకర్, వియానాల నర్సిరెడ్డి, మల్లారెడ్డి, పెద్ది తిరుపతిరెడ్డి, దుప్పల మహేష్, ఈసం కోటి, ఈసం లక్ష్మణ్, ఈసం సారయ్య, సుంకరి భూపాల్ రెడ్డి ఉన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



ములుగు రూరల్: పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ సీతారాంనాయక్



కన్నాయిగూడెం: హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

ములుగు రూరల్: మండలంలోని జగ్గన్నపేట పంచాయతీ పరిధి అన్నపల్లి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. మంగళవారం ఆంజనేజస్వామి విగ్రహ ప్రతిష్ఠాన కార్యక్రమం వేదపండితులు మంత్రోచ్ఛరణల నడుమ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు అజ్మీరా సీతారాంనాయక్ ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా గ్రామంలో బంధువుల కోలహాలం నెలకొంది. మూడు రోజుల పాటు బొడ్రాయి (గ్రామదేవత) ప్రతిష్ఠాన వేడుకలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గుర్రేవులలో..

కన్నాయిగూడెం: మండలంలోని గుర్రేవులల్లో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు పలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆకుతోట రామారావు, పూజారులు నరేష్ చార్యులు, మనోహర్ శర్మ, భార్గవచారి పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో అధికారమే లక్ష్యం



మాట్లాడుతున్న పైడాకుల అశోక్

ఎస్ఎస్ తాడ్వాయి: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు ముందుకు సాగాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖ్య నాయకులు సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి నాయకులు, కార్యకర్తలే బలమని పార్టీ బలోపేతం కోసం కలిసి కట్టు పనిచేయాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కేసీఆర్ మోసపూరిత వాగ్దానాలను, నెరవేర్చని హామీలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశ పెట్టిన రైతు, యువత డిక్లరేషన్ కార్యక్రమాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు. రైతు ధాన్యం కొనుగోలులో లారీల కొరతపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, ఇందుకోసం రైతుల పక్షాన 2 వేల మందితో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి వెనుకాడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ మార్క విజయ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, సహకార సంఘం అధ్యక్షుడు సత్తిరెడ్డి, ములుగు మండల అధ్యక్షుడు చాంద్ పాషా, తాడ్వాయి మండల మాజీ అధ్యక్షుడు అనంతారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పులి సంపత్, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ముజాఫర్ హుసేన్, మహిళా కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సృజన, జిల్లా సీనియర్ నాయకుడు ఆరెం లచ్చుపటేల్, ఎంపీటీసీ మేడిశెట్టి జయమ్మ, సర్పంచులు ఇర్ప సునిల్, నరసింహస్వామి, సహకార సంఘం మాజీ చైర్మన్ పాక సాంబయ్య, సింగల్ విండో డైరెక్టర్లు మల్లయ్య, సిద్దిరెడ్డి, జగన్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, తాడ్వాయి గ్రామ కమిటీ అధ్యక్షుడు పాక రాజేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాంబాబు, నాయకులు సారయ్య, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటకృష్ణ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ఆలస్యం



కుప్పలపై నిలిచిన నీటిని చూపిస్తున్న దావూద్

ఏటూరునాగారం: అధికారుల నిర్లక్ష్యంతో ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలో ఆలస్యం అవుతుందని సీపీఎం మండల కార్యదర్శి దావూద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించి రైతులతో మాట్లాడారు. 50 శాతం ధాన్యం కూడా తరలించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కురిసిన అకాల వర్షంతో రైతులు దిగాలు చెందుతున్నారని, ఆరుకాలం పండించి చేతికి వచ్చిన పంట చేయి జారిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నారని అన్నారు. ప్రత్యేక దృష్టి రైతులపై సారించి లారీల కొరతను నివారించి రైతులను ఆదుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వసంత మహేష్, చిక్కుల విజయ్, జనగాం లక్ష్మయ్య, కుమ్మరి సమ్మయ్య, గోగు బాబు, కుమ్మరి రమేష్, కొండ గొర్ల రంజిత్, కొండ గొర్ల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ వేడుకలు



ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ములుగు రూరల్: సీఐటీయూ ఆవిర్భావ వేడుకలను జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు సీఐటీయూ జెండాను జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికుల శ్రమదోపిడీదారులకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల కోసం నిరంతరం సీఐటీయూ పోరాడుతుందని అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు, ఎనిమిదిగంటల పని దినాల కోసం సీఐటీయూ వీరోచిత పోరాటం చేసి హక్కులను సాధించిందని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 9 సంవత్సరాల అధికార కాలంలో సరళీకృత ఆర్థిక విధానాలను తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలు మార్చి కార్మికుల పొట్టకొడుతుందని ఆరోపించారు. రాజకీయ స్వార్థం కోసం అధికార దుర్వినియోగం చేస్తూ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోడ రమేష్, నీలాదేవి, ప్రవీణ్, బ్రహ్మచారి, సాంబయ్య, రాజు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్య పడొద్దు



మాట్లాడుతున్న ఎంపీపీ లావణ్య

భూపాలపల్లి రూరల్: మండలంలోని రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తుందని ఎంపీపీ మండల లావణ్య సాగర్ రెడ్డి అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లావణ్య అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. ధాన్య కొనుగోలు కేంద్రాల్లో రైతుల చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని తెలిపారు. గండ్ర వెంకటరమణారెడ్డి సంపూర్ణ సహకారంతో మండలంలోని అన్ని గ్రామాలకు తారు రోడ్లు తాగునీరు తదితర మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెలతో పాటు పట్టణాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో శానిటేషన్ పనులు ప్రారంభించాలని పైపులైన్ లీకేజీలు సరిచేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. జూన్ రెండు నుంచి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు సర్పంచులు, జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ కుమార్ యాదవ్, ఎంపీడీఓ అనిల్ కుమార్, ఎంపీ ఓ నాగరాజు, వైస్ ఎంపీపీ సముద్రాల దీపారాణి శ్రీనివాస్, తదితర అధికారులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వాజేడు: గ్రామస్తులతో మట్లాడుతున్న వైద్యులు



కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కన్నాయిగూడెం మండల పీహెచ్‌సీ వైద్యుడు అభినవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుట్టలగంగారంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఫీవర్ సర్వే చేసి వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అభినవ్ మాట్లాడుతూ.. వర్షాకాలం సమీపిస్తున్నందున ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. వేసవి కాలం కావడంతో ఎండల తీవ్రత ఎక్కువ ఉన్నందున జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గిరి, ఫార్మసిస్ట్ గంగాధర్, ల్యాబ్ టెక్నీషన్ సురేష్ తదతరులు పాల్గొన్నారు.

వాజేడు: మండల పరిధిలోని కొంగాల గ్రామంలో జ్వరాల తీవ్రతపై డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి జ్వరాలు ఉన్నాయా లేవా అడిగి తెలుసుకున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలను సేకరించి ఆర్డీటీ పరీక్షలు చేశారు. గ్రామంలో ఉన్న మురుగు గుంటలు, కాలువల్లో టీమోపాస్ మందును చల్లారు. వైద్య పర్య వేక్షకుడు కోటిరెడ్డి, ఏఎన్ఎమ్ చాయాదేవి, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నిధులు మంజూరు చేయాలి

ములుగు రూరల్: జిల్లాలోని కొత్తగూడెం మండలం బత్తులపల్లి, పోగుల్లపలల్లి, పునుగుండ్ల, ములుగు మండలం జగ్గన్నపేట, వెంకటాపూర్(ఎం) మండలం బుర్గుపేట, గోవిందరావుపేటమండలం దుంపెల్లిగూడెం, తాడ్వాయి మండలం రంగాపురం, ఏటూరునాగారం మండలం శకర్‌రాజ్‌పల్లి, రామన్నగూడెం, కొండాయి, మంగపేట మండలం సంగంపల్లి, బుచ్చంపేట గ్రామాలలో నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణానికి నిధులు మంజూరి చేయాలని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. జిల్లాలోని గిరిజన, గిరిజనేతరులు అత్యధికంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని అన్నారు. వ్యవసాయానికి అవసరమైయ్యే సాగు నీరుకోసం ఎక్కువ మొత్తంలో బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్నారని విద్యుత్ సరఫరాలో అంతరాయం కారణంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నూతన సబ్‌స్టేషన్‌ల నిర్మాణం చేపట్టి రైతులను ఆదుకోవాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి

టేకుమట్ల: గ్రామాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై చల్ల రాజు అన్నారు. మంగళవారం మండలంలోని వెలిశాలలో మేము సైతంలో భాగంగా సర్పంచ్ చింతపెల్లి స్వామిరావు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక సీసీ కెమెరా100 మంది పోలీసులతో సమానమన్నారు. మండలంలోని గ్రామాల్లోని కూడలీలలో, రద్దీ ప్రాంతంలో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోని వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడితే సులభంగా గుర్తించవచ్చని అన్నారు. అలాగే వ్యాపారులు కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి దొంగతనాలకు తావులేకుండా ఉండవచ్చని అన్నారు. గ్రామంలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలో అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ స్వామిరావు, మాజీ సర్పంచ్ ఎండీ కమురోద్దీన్, పోలీస్ కానిస్టేబుళ్లు మధూకర్, రాజు, వ్యాపారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బురుదమయంగా రహదారి



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



మధ్యలోనే నిలిచిపోయిన సైడ్ కాల్వ నిర్మాణం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సాయి బాబా దేవాయలం ఎదుట ఉన్న రామన్నగూడెం-ఏటూరునాగారం ప్రధాన రోడ్డు చినుకుపడితే చిత్తడిగా మారుతుంది. మంగళవారం ఉదయం కురిసిన వర్షానికి రోడ్డు బురదమయంగా మారడంతో వాహన దారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పంచాయతీరాజ్ ద్వారా రూ.50 లక్షలతో చేపట్టిన మురుగు కాల్వల మధ్యలోనే నిలిపివేయడంతో మురుగు నీరు వచ్చి చేరింది. రోడ్డుపై ఉన్న నీరు కాల్వలలోకి వచ్చే విధంగా ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో ఇటు రోడ్డు, అటు కాల్వల అసంపూర్తిగా మారి ప్రజలకు ఇబ్బందిని తెచ్చిపెట్టాయి. దీంతో చుట్టు పక్కల వారు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సర్పంచ్, కార్యదర్శులు కాలువల నిర్మాణంలో ఆలసత్వం ఉండడంతో నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదని పలువురు వాపోతున్నారు. నిర్మాణ పనులు పూర్తి చేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

11న జైఆదివాసీ బహిరంగ సభ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆదివాసీలు

వాజేడు: భద్రాచలంలో జూన్ 11న నిర్వహించనున్న జైఆదివాసీ బహిరంగ సభ కరపత్రాలను ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఉయిక శంభర్ దొర మాట్లాడారు. 11 గిరిజనేతర కులాలను ఎస్టీ జాబితాలో చేరచడానికి తెలంగాణా ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని అన్నారు. ఆ తీర్మానాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో లంబాడా, ఏరుకల, యానాదులను కలిపి ఆదివాసీలకు ఇబ్బందులను తెచ్చారని ఇప్పుడు మరో 11 కులాలను కలు పడం ద్వారా ఆదివాసీల మనుగడ భూస్థాపితం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం జిల్లా అధ్యక్షుడు విసి దొర, నాగరాజు, వంశీ, పూనెం గోపి, పూనెంజగన్, నర్సింహరావు, రాజు ఉన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఏటూరునాగారం: హనుమకొండలోని ఆర్ట్అండ్ సైన్స్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ బలహీనవర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ జూన్ 4న నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కర్ణ ముత్తయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం మండల కేంద్రంలో బహిరంగ సభ కరపత్రాలను కర్ణముత్తయ్య ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సభకు అత్యధిక సంఖ్యలో మాదిగ విద్యార్థులు, దివ్యాంగులు, మాదిగ ఉద్యోగులు, మహాజన సోషలిస్టు పార్టీ నాయకులు వేలాదిగా తరలిరావాలన్నారు. హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. ఈ కార్యక్రమంలో వావిలాల శ్రీను, వావిలాల ఎల్లయ్య, వావిలాల ఎల్లస్వామి, దీపాక రాంబాబు, ఎంపెల్లి సంపత్, ఎంపెల్లి కిరణ్, సాంబశివరావు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని కిష్టారావుపేట మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో సోదాలు చేసి ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే గ్రామంలో మత్తు పదార్థాలైన గంజాయి, గుట్కా, సారా వంటివి విక్రయించవద్దని అన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ములుగు : 9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. గణేష్ బాబు (S.R): 9490002099, 7997958188
పి.చంద్రశేఖర్ (A.C.O): 8074606274